అన్నదాతా సుఖీభవ

నేను ముకుందరావు ధోరణికి నివ్వెరపోయాను.

స్థలం... ముకుందరావుకు చెందిన విశాలమైన తోట చివర మేడపైన విశాలమైన గది... అతి ఖరీదైన ఫర్నిచర్ అన్ని వైపులా... గోడవారగా కిటికీ పక్కన వేలు వేల ఖరీదు చేసే దారుశిల్ప కళాఖండంలాటి పెద్దమంచం... చుట్టూ అందాల దోమతెర... క్రింద అంతటా రంగురంగుల రమణీయమైన తివాచీ... మెత్తగా మృదువుగా... గోడలకు కళ్లు చెదరగొట్టే అద్భుతమైన రంగులలో దేశదేశాలనుంచి సేకరించితెచ్చిన అపూరూప చిత్రాలు... గుండ్రంగా ఉన్న బల్లచుట్టూ మేము ముగ్గురం...

రాత్రిబాగా పొద్దుపోయినట్టున్నది. చుట్టుపక్కల చెట్లలోనుంచి సన్నగా పక్షుల ధ్వనులు...

నేనూ ముకుందం కాక మూడో వ్యక్తి పురుషోత్తం. దూరంగా ఎక్కడో బొకారో సిటీలో పెద్ద ఉద్యోగంలో ఉన్నాడు ప్రస్తుతం. వాళ్లిద్దరూ చాలాకాలం తరువాత నేటికి కలుసుకున్నారు. ఆనాడు ముకుందరావు పుట్టినరోజు. నేను చాలా సామాన్యుణ్ని. ఒక స్థానిక కళాశాలలో అధ్యాపకవృత్తి సాగిస్తున్నవాణ్ని. ఇంతకాలానికి బాల్యమిత్రుల ఆహ్వానం అందుకుని వచ్చాను.

ముకుందరావు చాలాసేపటినుంచి ఏకధాటిగా మాట్లాడుతున్నాడు. "అన్నట్టు రేపు ఫ్లయిట్‌లో ఢిల్లీ వెళ్ళాలి. ఈ ప్రయాణాలంటే మహా చిరాకు నాకు. కాని తప్పదుమరి... ఏం చేస్తాం?" అన్నాడు. అతగాడు ఢిల్లీ వెళ్లడం అంటే నాబోటివాడు పక్కవీధికి వెళ్లడం వంటిది. దేశంలోనే కాక ఏ రెణ్నెల్లకో ఒకసారి ఎటో ఒకవైపు ఫారిన్ ట్రిప్ తప్పదుమరి. అతని వ్యాపారాలు, లావాదేవీలు అటువంటివి.

అతను పక్కా అరగంటనుంచి రెండే విషయాలు మాట్లాడుతున్నాడు. 'మనదేశం ఎంతగా చెడిపోయింది? స్వాతంత్ర్యం వచ్చాక మనం ఎంతగా పతనమైపోయాము? జాతిపిత, అని పేరు పొందిన గాంధీ, నవభారత నిర్మాత అని పేరు పొందిన నెహ్రూలు దేశాన్ని, జాతినీ ఎలా దిశారహితంగా నడిపారో? ఇతర దేశాలతో పోల్చుకుంటే మనం ఎక్కడ ఉన్నాము?' ఇది అతని మొదటి బాధ. ఆ తర్వాత రెండవ బాధ ఎన్నడో పోయిన తన తండ్రిని గురించి. వారికి పిత్రార్జితమైన ఆస్తిపాస్తులు చాలా ఉండేవి. ఇతని తండ్రి స్వాతంత్ర్యాత్పూర్వం మద్రాసులో లా చదివాడు. స్వాతంత్ర్యోద్యమంలో చురుకుగా పాల్గొని జైళ్లపాలైనాడు. ఆ తర్వాత దేహీ అన్నవారికి లేదనకుండా, కాదనకుండా సహాయాలు చేశాడు. చేతికెముక లేనివాడని

ప్రసిద్ధి చెందాడు. అపర కర్ణుడనిపించుకున్నాడు. చివరకు ఉన్నదంతా కరిగించి వేసి భార్యను, పసివాడైన ముకుందాన్నీ వదిలేసి తన దోవన తాను పోయాడు.

ముకుందానికి తండ్రి అంటే కోపం... కసికూడా. 'దేశం దేశం' అని వెర్రిగా సమస్తం పోగొట్టుకున్న వాళ్లంటే లవలేశమైనా జాలి లేదతనికి. అంతా పాడుచేసి తనను పట్టించుకోలేదని అతని వేదన. అయితే తానుకూడా తక్కువేమీ తినలేదు. తన తండ్రిపేరు రకకాలుగా ఎక్కడ పడితే అక్కడ ఉపయోగించుకుని, 'వారి అబ్బాయివా?' అనిపించుకుని తాను ఎన్ని లాభాలు గడించాడో, ఎన్ని పర్మిట్లు లైసెన్సులు పొందాడో, ఎన్ని పదవులు ఆస్తులు సంపాదించాడో మాత్రం అతడు ఎవరికీ చెప్పడు. అంతా అతని సొంత ప్రయోజకత్వమే అని ఎదుటివారు అనుకోవాలని అతని నిరంతర తాపత్రయం. 'చిన్నప్పటినుంచీ అష్టకష్టాలు అనుభవించి కేవలం స్వయంకృషితో ఈస్థితికి చేరుకున్నాను' అంటూ ఉంటాడెపుడూ.

అయిందా-?

ఇపుడు పురుషోత్తం నిశ్శబ్దాన్ని ఛేదించాడు. ఒక్కసారి ఆవులించి చిటికె వేసి, "బాగుందయ్యా నీ ధోరణి... నీలాగ చాలామంది ఉన్నారు ఈ దేశంలో.. నీ సంగతి ఎంతో నయం. నీకు చొరవ ఉంది చిన్నప్పటినుంచీ. తెలివికలవాడివి... జాగ్రత్తపరుడివికూడా. ఆచితూచి అడుగువేస్తూ ఉంటావు. మరి కొందరున్నారు. పుట్టడమే ఎక్కడినుంచో ఏదేదో చేతబట్టుకు వచ్చినట్టు మాట్లాడుతూ ఉంటారు. తండ్రులు తమకు చెందవలసిన పిత్రార్జితాలన్నీ, దేశంకోసమో, ప్రజలకోసమో, పేదసాదలకోసమో, సంఘసంస్కరణలకోసమో వ్యయించి కడుపున. పుట్టిన సంతానానికి ఏమీ మిగల్చకుండా పోవడం... ఈ పిల్లలేమో నీలాగ తెలివిగలవాళ్లు కాక ఏదో పిచ్చి చదువులు చదివి ముష్టి ఉద్యోగాల్లో చేరి ఇరుకు బతుకులు బ్రతకడం... ఎండకన్నెరుగక షోయిగా జీవించవలసిన వాళ్లు అతి సాదాసీదా ఉద్యోగాలు, అరవచాకిరీ చేస్తూ చాలీ చాలని జీతపు రాళ్లతో బ్రతుకులు ఈడుస్తూ ఉంటారు. వాళ్ల సంగతి మరీ దారుణం..." అన్నాడు.

నేను కలుగచేసుకున్నాను.

"మా నాన్నగారు అలాగే చేశారు. అయినా నాకేమి చింత లేదు" అన్నాను. ముకుందం ముందుకు వంగి "ఏముండేది మీకు?" అని అడిగాడు.

"చాలా ఉండేది. ఫాతిక ఎకరాల సుక్షేత్రమైన మాగాణి... అయిదెకరాల మెట్ట ఉండేది. విరగపండే మామిడితోట ఉండేది. నాకు ఊహ తెలిసే సరికి అన్నీ కరిగిపోయాయి."

"మరి నీకు ఆ బాధ లేదా?"

"ఏ బాధ?"

"అదే.... మీ నాన్న నీకేమీ లేకుండా చేసిపోయాడే అన్నబాధ!"

నేను తల అడ్డంగా ఊపాను. "ఏమాత్రం లేదు... పొలాలూ తోటలూ దొడ్లూ పోతే పోనియ్... ఆయన స్వయంగా సంపాదించి సమకూర్చిపెట్టిన అపురూపమైన సంపద నాకు దక్కింది. అది చాలు అనుకున్నాను నేను!

"ఏమిటది?" అన్నారిద్దరూ ఆత్రంగా.

"పుస్తకాలు... వందల కొద్దీ అపూరమైన అలభ్యమైన పుస్తకాలతో మా నాన్నగారి గ్రంథభాండాగారం నాకు సంక్రమించింది. దానిముందు ఈ పొలాలూ, తోటలూ, దొడ్లూ, లక్షలూ ఎందుకు పనికొస్తాయి?" అన్నాను.

ఇద్దరూ కొంచెం ఆశ్చర్యపోయారు.

కొద్దిక్షణాలు నిశ్శబ్దం...

పురుషోత్తం ముకుందం వైపు తిరిగి "అన్నట్టు మరిచిపోయానింతసేపూ... ఇటీవల ఒక చిన్న అనుభవం... చెప్పాలని అనుకుంటున్నాను. చెప్పనా? వింటారా?" అన్నాడు.

ముకుందం మళ్ళీ ఆవులించి తల ఊపి ఆమోదం తెలిపాడు. అనుభవం అనగానే కాస్త ఉత్కంఠ కలిగించేదిగా రంజుగానే ఉంటుందని అనుకున్నట్టున్నాడు. నేను సహజంగానే వినడానికి ఉద్యుక్తుణ్ణయినాను. పురుషోత్తం గొంతు సర్దుకుని మొదలు పెట్టాడు. కిటికీలో నుంచి వినబడుతున్న కీచురాళ్ల ధ్వని మినహా... బయట ఏవేవో పురుగులు చేస్తున్న సవ్వడి మినహా... చుట్టూ నిశ్శబ్దం. గాలి విసురుకు కిటికీలకు, గుమ్మాలకు ఉన్న పలుచని తెరలు కదులుతున్నాయి. చాలా రోజుల క్రిందట... పురుషోత్తం ఉత్తరభారతంలో తాను ఉద్యోగం చేస్తున్న బొకారో సిటీనుంచి ఒక చిన్న సూట్‌కేసుతో బోలెడు డబ్బుతో ప్రయాణిస్తూ వచ్చాడు. ఒక క్షేత్రంలో స్టేషనులో దిగగానే కాసిని కాఫీనీళ్లు గొంతులో పోసుకుని ఇవతలికి వచ్చి 'ఏదో ఒక హోటలుకు పోనిమ్మ'ని రిక్షా మాట్లాడుకున్నాడు. తెల్లవారుజాము... చీకట్లు వచ్చిపోతున్నాయి. నగరం ఇంకా నిద్రలేవలేదు. జనసంచారం పలుచగా ఉంది. కాని, కాస్సేపాగితే ఈ రోడ్లు కిటకిటలాడుతూ పొగతో, దుమ్ముతో ఘోరంగా దుర్భరంగా తయారవుతాయి. ఈ లోపలే ఏదో ఒక మంచి హోటలుకు వెళ్లి బస చేస్తే మంచిదనుకున్నాడు. వెళ్తూవెళ్తూ ఒకచోట రిక్షా ఆపి 'ఒక్కక్షణం' అంటూ దిగి రోడ్డు అవతలివైపు ఉన్న కిల్లీకొట్టు దగ్గర సిగరెట్ పెట్టె కొనుక్కుని జేబులో ఉన్న ఒకే ఒక పదిరూపాయల నోటు ఇచ్చి, ఇటు తిరిగే సరికి గుండెలు దడదడలాడాయి. అక్కడ తన రిక్షా లేదు. కిల్లీ దుకాణం వాడు ఆశ్చర్యంగా 'మీరు రిక్షాలో వచ్చారా సార్!' అని అడిగాడు. పురుషోత్తం కంగారుగా అటూయిటూ పరుగెత్తాడు. కాని ఏమీ లాభంలేకపోయింది. అతడు హతాశుడైనాడు. రిక్షాలో ఉన్న తన చిన్న సూట్‌కేసులో వేలకొద్దీ రూపాయలు, కొన్ని చెక్కులు, కొన్ని డ్రాఫ్టులు, రెండు జతల బట్టలు, టవలు, ఇతర సామగ్రి మొత్తం పోయినట్టే.

కాస్సేపు ఆ పక్కనే ఒక ఇంటిమెట్లమీద కూర్చుండిపోయాడు. 'సిగిరెట్టు పెట్టెకోసం దిగడం ఎంత ప్రమాదం తెచ్చిపెట్టింది' అనుకుంటూ తల

పట్టుకున్నాడు. జేబులో కొన్ని రూపాయి, అర్ధరూపాయి నాణేలు మాత్రం మిగిలి ఉన్నాయి. తన ఊరికి వందలాది మైళ్లదూరంలో కేవలం కట్టుబట్టలతో, అవీ మాసి మట్టికొట్టుకుని ఉన్నాయి - నిలబడి వున్నాడు. తనస్థితికి తానే దిగులు పడుతూ చాలాసేపు నిశ్చలంగా కూర్చుండిపోయాడు. ఈ లోపల వీధిలో జనసంచారం పెరిగింది.

అతడు తేరుకుని లేచాడు. 'పోస్టాఫీసు ఎక్కడ?' అని విచారించాడు. వెళ్లి అది తెరిచేవరకు వేచి ఉండి తర్వాత తన ఆఫీసుకు ఒక టెలిగ్రాం ఇచ్చాడు. పోస్టుమాస్టరుకు తన స్థితి వివరించాడు. పోస్టాఫీసు అడ్రసే ఇచ్చాడు. ఆ తరువాత ఇవతలికి వచ్చి వెర్రివాడిలా నడవటం ప్రారంభించాడు. తనస్థితి తనకే వింత అనిపించింది. తిరిగితిరిగి నదిని చూశాడు. పెద్ద వంతెన చూశాడు. కొండ మెట్లెక్కి పైన ఆలయం చేరుకున్నాడు. అప్పటికే అక్కడ కొన్ని వందలమంది భక్తులు నదీ స్నానాలు ముగించుకుని దైవదర్శనార్థం క్యూలలో నిలబడి ఉన్నారు. పురుషోత్తం వెళ్లి క్యూలో నిలబడ్డాడు. క్యూ నెమ్మదినెమ్మదిగా కదులుతున్నది. అతడపుడు ప్రశాంతంగా ఉన్నాడు. మనసులో అలజడి ఏమీ లేదు.

'దైవదర్శనం చేసుకుని కిందికి వెళితే సరి... పోస్టాఫీసుకు డబ్బు వస్తుంది. టిక్కెట్టు కొని మళ్లీ రైల్లో పడితే సరి... అడంగుకు చేరుకోవచ్చు.' అనుకుంటున్నాడు కాని ఇపుడిపుడే అసలు చింత మొదలవుతున్నది. కడుపులో ఏదో అదృశ్యబాధ మొదలవుతున్నది. కాస్సేపాగితే ఆ బాధ తట్టుకోవడం కష్టం. క్యూలో ముందుకు సాగుతూ ఉండగా ఒకచోట మలుపులో ఎవరో అతన్ని ఆపి అతని ముఖంలోకి చూసి చేతిలో ఒక కాగితం ముక్క ఉంచారు. అదేమిటో కూడా పట్టించుకోకుండా అతడు దాన్ని చేతిలోనే ఉంచుకుని ముందుకు నడిచాడు. దైవదర్శనం చేసుకుని ఇవతలికి వస్తూ ఆ కాగితం ముక్కను నలిపి ఉండచుట్టి అవతల పారేశాడు. అంతలో ఒక వ్యక్తి దాన్ని తీసుకుని వచ్చి "ఏం భోజనం వొద్దా?" అని అడిగాడు. ఆ తర్వాత వివరించాడు. కాస్సేపాగితే అక్కడ భోజనం పెడతారు. 'నిరతాన్నదాన పథకం' క్రింద అక్కడ ప్రతిదినం ఆర్తులకు, దీనులకు, భిక్షుకులకు చక్కని భోజనం పెడతారు. ఎవరెవరో వదాన్యులు, దాతలు ఇచ్చిన ధనం పైన వచ్చే ఆదాయంతో వారు కోరిన రోజులలో అన్నదానం జరుగుతుంది. వారిపేర్లు ఏరోజుకారోజు బయట పెద్ద బోర్డుపైన వ్రాస్తారుకూడా.

పురుషోత్తం ఆ కాగితం అందుకుని జాగ్రత్తగా మడతలు విప్పి జేబులో ఉంచుకున్నాడు. అక్కడే కూర్చుండిపోయాడు చాలాసేపు. ఆ తర్వాత అక్కడి పెద్ద భోజనశాలలో సందడి మొదలైంది. పన్నెండు గంటలవేళ లోపల రకరకాల భోజనార్థులు చేరారు. పురుషోత్తంకూడా వెళ్లి ఒక చోట కూర్చున్నాడు. చక్కని భోజనం పెట్టారు. పురుషోత్తం భోజనం చేసి 'అన్నదాతా సుఖీభవ' అనుకుంటూ ఇవతలికి వచ్చాడు.

పక్కనే ఉన్న బోర్డుమీద పెద్ద అక్షరాలతో ఆనాటి భోజన దాతల పేరు వ్రాసి ఉంది.

పురుషోత్తం ఆ పేరు చదివి చలించిపోయాడు. కళ్లనీళ్లు ఉబికి వచ్చాయి. తర్వాత పోస్టాఫీసుకు డబ్బు వచ్చింది. అతడు రైలెక్కి అడంగుకు చేరుకున్నాడు.

ఇంతా చెప్పి అతడు ఆగి "అవును.. నాకప్పుడు కళ్లనీళ్లు ఉబికి వచ్చాయి" అన్నాడు.

శ్రోతలిద్దరూ ఆశ్చర్యపోయారు.

ముకుందరావు సన్నగా నవ్వి "తిన్నావు సరే... ఆ తర్వాత కళ్లవెంట నీళ్లు రావడం ఏమిటి?" అని అడిగాడు.

"అక్కడ బోర్డుమీద ఉన్న పేరు చూడగానే నిజంగానే కన్నీళ్లొచ్చాయి. ఆ పేరు నీదే... చక్కగా ఇంటిపేరుతో సహా నీపేరే అది. నీ పుట్టిన రోజు సందర్భంగా... మీ నాన్నగారు దాత... అక్కడ ఎల్లకాలం అన్నదానం జరుగుతూనే ఉంటుంది. ఎందరో తృప్తిగా ఆకలి తీర్చుకుని 'అన్నదాతా సుఖీభవ' అని కనబడని నిన్ను ఆశీర్వదిస్తూ వెళుతూ ఉంటారు..." అని ముగించాడు పురుషోత్తం.

ముకుందరావు చిత్రంగా చూసి "అలాగా" అని మాత్రం అన్నాడు. అతని కళ్లలో చిత్రమైన వెలుగు కనిపించింది.

❀ ❀ ❀